విశాఖ ఉక్కు పరిరక్షణలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పాత్ర కీలకం

జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు క్రిష్ణమూర్తి (పండు)

విశాలాంధ్ర-చింతపల్లి : విశాఖ ఉక్కు (స్టీల్ ప్లాంట్) పరిరక్షణలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పాత్ర కీలకమని జనసేన పార్టీ చింతపల్లి మండల ఉపాధ్యక్షుడు కిముదు క్రిష్ణమూర్తి (పండు) అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన భారీ ప్యాకేజీ విశాఖ ఉక్కు (స్టీల్ ప్లాంట్) కు వరమని, కార్మికుల చిరకాల వాంఛ నెరవేరడానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి ఫలించిందన్నారు.. కేంద్ర సాయం పట్ల కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నా యన్నారు. విశాఖ ఉక్కు(స్టీల్ ప్లాంట్) పరిశ్రమ పరిరక్షణలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పోషించిన పాత్ర కేలకం అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటన వెలువడిన వెంటనే ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దల ఎదుట పరిశ్రమ పరిరక్షణకు బలంగా వాదన వినిపించారన్నారు. విశాఖ ఉక్కు పై ఎప్పటికప్పుడు కేంద్ర పెద్దలను కలుస్తూ చిత్తశుద్ధితో పోరాడిన నాయకుడు పవన్ కళ్యాణ్ అని, ఆయన కృషి ఫలించి నేడు కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11, 440 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

పారా గ్లైడింగ్ విజయవంతం

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్

విశాలాంధ్ర-అరకులోయ : ప్రముఖ పర్యట కేంద్రం మాడగడ సన్రైజ్ పాయింట్ వద్ద ప్రయోగాత్మకంగా నిర్వహించిన పారాగ్లైడింగ్ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ తెలియ జేశారు. కలెక్టర్ ఆదేశాలమేరకు ఆదివారం హిమాచల్ ప్రదేశ్ ఆరెంజ్ పారా గ్లైడింగ్ స్కూల్ పైలట్ శిక్షకులు విజయ్ సోనీ నేతృత్వంలో పారా గ్లైడింగ్ ట్రైనీ అలిషా విజయవంతంగా నిర్వహించారని చెప్పారు. విజయ్ సోనీ మాట్లాడుతూ మాడగడ ప్రాంతం పారా గ్లైడింగ్‌కు అత్యంత అనుకూలంగా ఉందన్నారు. పర్యాటకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని చెప్పారు. అరుకు చలి ఉత్సవం సందర్భంగా పెరా ఏర్పాటు చేస్తున్నామని పి.వో చెప్పారు.

గోపాల్ మృతి పార్టీకి తీరని లోటు

వైసీపీ నేత గోపాల్ పార్థీవ దేహానికి మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి వికాస్ నివాళి

విశాలాంధ్ర-అరుకులోయ : వైఎస్సార్ సీపీ నేత శెట్టి గోపాల్ భౌతిక కాయానికి నివాళు లర్పించిన గిరిజన మన్య ప్రగతి చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి వికాస్. ఆదివారం మృతిడి నివాసనికి చేరుకొని గోపాల్ మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరనిలోటని వ్యాఖ్యా నించారు. ముందుగా శెట్టి గోపాల్ కుటుంబ సభ్యులకు పరామర్శించి సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ సేవా దృక్పథం కలిగిన నేతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు కులమత రాజకీయాలకు అతీతంగా తమ ప్రాంతాల ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టా రన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్టతకు గోపాల్ ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పలు ఉద్యోగ సంఘాలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పలువురు వైసిపి నేతలు కార్యకర్తలు గోపాల్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

మన్యంలో మణిహారం...!

-గిరిజనంలో ఉన్నత విద్యా కుసుమం
-పీహెచ్‌డీ పట్టా పొందిన తేడబరికి సురేష్‌కుమార్

విశాలాంధ్ర-పాడేరు : మన్యంలో మరో విద్యా కుసుమం వెల్లి విరిసింది. ఉన్నత విద్యా రంగంలో అగ్రగామిగా నిలుస్తూ ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థి పీహెచ్ డీ పట్టా సాధించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన తేడబరికి సురేష్ కుమార్ ఆంధ్రా యూనివర్సిటీ లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పరిశోధక విద్యార్థి గా తన పరిశోధనలకుగాను వర్సిటీ డాక్టరేట్ పొందారు. ఇటీవల వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు చేతులమీదుగా తేడబరికి సురేష్‌కుమార్ డాక్టరేట్ ఉత్తర్వులు అందుకున్నారు. ఏయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ ఆచార్యులు డాక్టర్ జి.వీర్రాజు పర్యవేక్షణలో అతని పరిశోధన సాగాయి. 'రోల్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీస్: ఏ స్టడీ ఆఫ్ ఐటిడిఏ పాడేరు ఆఫ్ అల్లూరి సీతారామరాజు డిస్ట్రిక్ట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్' అనే అంశంపై జరిపిన పరిశోధనకుగాను సురేష్ కుమార్ డాక్టరేట్ లభించింది. విశాఖ మన్యానికి చెందిన సురేష్‌ది వ్యవసాయ కుటుంబం. తండ్రి పేరు సన్యాసిరావు, తల్లి సింహాచలం. సురేష్ ప్రాథమిక విద్యాభ్యాసం 1-5 వరకు ప్రాథమిక పాఠశాల తడిగిరిలో, హుకుంపేట మండలం గవర్నమెంట్ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నారు. అక్కడే ప్రభుత్వ

జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో సీఈసీ గ్రూప్ విద్యను అభ్యసించారు. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ (బీఏ) పూర్తిచేసి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పొలిటికల్ సైన్స్ & పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. సురేష్ ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన సతీమణి లిల్లీ సురేష్ కూడా ఉన్నత విద్యావంతు రాలిగా ఉన్నారు. ఆమె ఎస్టీ కమిషన్ సభ్యులుగా పనిచేస్తు న్నారు. రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటూ సేవా కార్యక్రమాలు విస్తరించేందుకు గాను డాక్టర్ వైయస్సార్-టీఎస్ఆర్ వైస్సార్, చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించి, తమ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా డాక్టర్ సురేష్ కుమార్ ను ఏయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య పి.ప్రేమానందం, ప్రొఫెసర్ వీర్రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరీష్, విద్యార్థులు, అభిమానులు అభినందించారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

రాజ్యసభలో భారత రాజ్యాంగ రూపకర్తపై అవమానకార వ్యాఖ్యలు చేయడం సరికాదు
సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర-పాడేరు : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యసభలో భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్‌పై అవమాన కరమైన వాక్యాలు చేయడం సరికాదని తక్షణమే రాజీనామా చేయాలని, సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు కూడ రాధాకృష్ణ, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు, అన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం బంగారమెట్ట గ్రామంలో సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గొప్ప మేధావి అయినా అంబేద్కర్‌ను ఎగతాళి చేస్తూ అమిత్‌షా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలపై దేశ

వ్యాప్తంగా అగ్రహా జ్వాలాలు పెల్లుబికినా, నిరసనలు వెళువేత్తిన అమిత్ షా ను ప్రధాని మోడీ వెనకేసుకు రావడం దారుణం అన్నారు.వెంటనే ఎంపీ పదవీకు రాజీనామా చెయ్యాలని, మోడీ మంత్రి మండలి నుండి భర్తరప్ చెయ్యాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమనికి సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చంటిబాబు. సిపిఎం పార్టీ నాయకులు రమేష్ బాలు, లక్ష్మణరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మన్యంపై పంజా విసురుతున్న చలిపులి

వణికిస్తున్న శీతల గాలులు... దట్టంగా పరచుకున్న మంచు... దిగజారిన కనిష్ట ఉష్ణోగ్రతలు
చింతపల్లిలో సింగిల్ డిజిట్ 7.3కు పడిపోయిన ఉష్ణోగ్రత

విశాలాంధ్ర-చింతపల్లి : మన్య ప్రాంతంలో చలి పులి పంజా విసురుతుంది. శీతల గాలులు, దత్తంగా కమ్ముకుంటున్న పొగ మంచు, దిగజారిన ఉష్ణోగ్రతలతో మన్యవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శనివారం సాయంకాలం నుంచి శీతల గాలులతో కూడిన చలి తీవ్రంగా ఉండడంతో మన్యవాసులు చలి తీవ్రతను తట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం పది డిగ్రీలకు పైగా ఉన్న ఉష్ణోగ్రతలు శనివారం సాయంత్రం నుంచి ఒక్కసారిగా సింగిల్ డిజిట్ కు పడిపోయి 7.3గా నమోదు కావడంతో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. దీంతో మన్యవాసులు దైనందిన పనులు నిర్వహించుకునేందుకు కూడా ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఎదురైంది. రానున్న రోజుల్లో ఇదేవిధంగా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ఇటువంటి కనిష్ట ఉష్ణోగ్రతల కారణంగా ఆయాసం, శ్వాస కోస వ్యాధిగ్రస్తులు, చిన్నపిల్లలు తీవ్రంగా ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నాయని, దట్టంగా కమ్ముకుంటున్న పొగమంచు కారణంగా వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. శీతల గాలులు, చలి తీవ్రత కారణంగా రగ్గులు ఉన్ని దుస్తులకు గిరాకీ ఏర్పడింది.

శ్రమదానంతో రహదారి పనులు మరమ్మతులు

విశాలాంధ్ర-హుకుంపేట : మండలంలోని పట్టాం పంచాయతీ డాబువలస సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద బైరోడివలస, పట్టాం గ్రామ స్తులు కలిసి రహదారి పనులు శ్రమదానంతో మరమ్మతులు చేపట్టారు. గత కాలంలో వర్షంతో కల్వర్టు మర మ్మతులకు గురై నిర్మాణానికి నొచ్చుకోలేక అనేకమందికి ప్రమాదాలకు నిలయం మారింది. ఈ విషయంపై స్థానిక పంచాయతీ సర్పంచ్‌కు, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన స్పందించకపోవడంతో గ్రామస్తులందరు కలిసి స్వచ్ఛందంగా కల్వర్టు రహదారి గుంతలను ఆదివారం పూడ్చారు. వర్షాకాలం వస్తే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రహదారిపై కించుమండ వారపు సంతకు వెళ్లేందుకు ఈ ప్రాంత ప్రజలకు తక్కువ సమయంలో పడుతుండడంతో మూడు మండ లాల ప్రజలు ఇదే రహదారి మీదుగా వారపు సంతకు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం జన సమీకరణతో ప్రయాణాల సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బూత్ ఇన్చార్జి కొర్రా నూకరాజు, బాలన్న గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద గిరిజనులకు కలిగొట్ల సినగ్ద శ్రీదేవి ఫౌండేషన్ వివిధ రకాల వస్తువులు పంపిణీ

విశాలాంధ్ర-దంబ్రిగూడ : మండలంలోని గొంది గూడా గ్రామంలో స్థానిక యుటీఎఫ్ సహకారంతో భీమిలి పట్నం కలిగొట్ల సినగ్ద శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు, మహిళలకు చీరలు, రగ్గులు టవల్స్, స్టీల్ బసిన్లు, స్టీల్ బాక్సులు గ్లాసులు ఆదివారం ఉచితంగా పంపిణీ చేసుతూ అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ చైర్మన్ కె. శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థంగా ప్రతి ఏడాది జిల్లాల్లోని, మండలాల్లోని ఇటువంటి సేవా భావంతో కూడిన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని ఆయన చెప్పారు. గిరిజన పుత్రుల్లో అనేకమంది ఉన్నత విద్యను అభ్యసించి ఎటువంటి ఉపాధి లేక నిరుద్యోగులుగా మిగిలి ఉన్నారని, అటువంటి యువత యువకులు మత్తు పదార్థాలకు మాదకద్రవ్యాల వంటి చెడు ఏసనాలకు తావివ్వకుండా మంచి జీవన విధానాన్ని అలవర్చుకొని సమాజానికి కన్న తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. నిరుపేద యువతీ యువకులు క్రీడలపట్ల నైపుణ్యం ఉన్నటువంటి యువత పోలీస్, ఆర్మీ వంటి శాఖల్లో ఎంపీకకు కృషి చేసినట్లయితే అటువంటి యువతీ యువకులకు తమ ఫౌండేషన్ ద్వారా అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం జరుగుతాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ సభ్యులు కె ఎస్ ఎన్ మూర్తి, భాను జి రావు, శ్రీనివాస రావు, యుటీఎఫ్ సభ్యులు ఏ పైడిరాజు, వి రాంబాబు, అల్లూరి జిల్లా యుటీఎఫ్ అధ్యక్షులు జి మహేశ్వరరావు, ఉపాధ్యక్షులు టీ చిట్టిబాబు, స్థానిక మండల అధ్యక్షుడు ఎస్ .బాలకృష్ణ కార్యదర్శి ఎస్ కన్నయ్య, ఏం బాబురావు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

పత్రికా విలేఖర్లు కావలెను

విశాలాంధ్ర తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఈక్రింది మండలాలు మారేడుమిల్లి, రంపచోడవరం, ప్రాంతాలకు అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెం.
7989138129,
7386603589

అంగన్వాడీ సహాయకుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడి సహాయకుల పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా. టి. కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పాలకొండ డివిజన్‌లో సీతంపేట ప్రాజెక్టు పరిధిలో రెండు, భామిని ప్రాజెక్టు పరిధిలో ఒక పోస్టు, కురుపాం ప్రాజెక్టు పరిధిలో ఆరు, పార్వతీపురం డివిజన్‌లో పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో ఒకటి, సాలూరు ప్రాజెక్టు పరిధిలో ఒకటి అంగన్వాడి సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామని ఆమె చెప్పారు. పార్వతీపురం, సాలూరు, కురుపాం, సీతంపేట, భామిని ఐసిడిఎస్ ప్రాజెక్టులలో ఏర్పడిన 11 అంగన్వాడి సహాయకుల పోస్టుల ఖాళీలను షెడ్యూల్ ట్రైబల్ హేబిటేషన్ గ్రామాలను అనుసరించి షెడ్యూల్ ట్రైబల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు ఒక యూనిట్ గా పరిగణించి కేటగిరిని నిర్ధారించి ప్రకటించడం జరిగిందన్నారు. స్థానిక స్థిర నివాసం కలిగిన అర్హులైన వివాహిత మహిళా అభ్యరద్దుల నుండి దరఖాస్తులు కోరడం జరిగిందన్నారు. ధరఖాస్తు లను జనవరి 27వ తేది సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం, తదుపరి తెలియజేయడం జరుగు తుందని ఆమె అన్నారు. భర్తీ నియమ నిబంధనల ప్రకారం వచ్చిన ధరఖాస్తు దారులను మాత్రమే ఇంటర్వ్యూ నకు పిలవడం జరుగు తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ పోస్టుల భర్తీ చేయుటకు గాని, నిలుపుటకుగాని, రద్దు పరుచుటకుగాని నియామకపు కమిటీ చైర్మన్ కు పూర్తి అధికారం ఉందని ఆమె అన్నారు. అంగన్వాడీ సహాయకుల నియమకానికి స్థానిక స్థిర నివాసం కలిగిన వివాహిత మహిళ అయి ఉండాలని, 2024 జూలై 1వ తేదీ నాటికి 21 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని అన్నారు. ఎస్టి కేంద్రాలకు ఎస్టి కేటగిరికి రోస్టరులో రిజిస్టరు కాబడిన పోస్టులకు 21 సంవత్సరములు నిండిన అభ్యర్థులు లేని ఎడల 18 సంవత్సరాలు నిండిన వారిని కూడా పరిగిణలోకి తీసుకోవడం జరుగుతుందని ఆమె అన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులు అయినవారు అర్హులని, 10వ తరగతి పాస్ అయిన వారు లేనియెడల దాని కన్నా తక్కువ విద్యా అర్హత కలిగినవారిని పరిగణలోకి తీసుకోవడం జరుగు తుందని ఆమె వివరించారు. ఎస్టి హేబిటేషన్‌కు కేటాయించిన పోస్టులలో ఎస్టి అభ్యర్థులను మాత్రమే భర్తీ చేయడం జరుగు తుందన్నారు. ఎంపికపై తుది నిర్ణయం కమిటీ కలిగి ఉంటుందని ఆమె చెప్పారు. అభ్యర్థులు దరఖాస్తు లను సంబంధిత ప్రాజక్టు కార్యాలయంలో పొందవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తులను అదే కార్యా లయంలో అంద జేసి రశీదును పొంద వచ్చని చెప్పారు. అంగన్వాడీ సహాయ కులు నియామకానికి క్రింద తెలిపిన నిబంధనలు అనుసరించడం జరుగు తుందని పేర్కొంటూ ఈ విధంగా తెలిపారు. 10వ తరగతి పరీక్ష ఉత్తీర్ణత అయిన అభ్యర్థులకు 50 మార్కులు, ప్రీస్కూలు టీచర్/కృషి/ప్రీస్కూల్ మేనేజ్మెంట్‌లో ఇంటర్ మీడియట్ బోర్డు, గుర్తింపు పొందిన యూనివర్సిటీ ద్వారా పొందిన సర్టిఫికేట్ కలిగిన వారు లేదా ఇసిఇ వర్కర్‌గా పనిచేయు చున్న వారికీ 5 మార్కులు, వితంతువులకు 5 మార్కులు, మైనార్టీ తీరని పిల్లలు కలిగిన వితంతువులకు 5 మార్కులు, పూర్తి అనాథ, బాలసదన ప్రభుత్వ సంస్థలలో నివసించి మంచి నడవడిక, సత్ప్రవర్తన సర్టిఫికేట్ కలిగినవారికి 10 మార్కులు, అర్హత కలిగిన వికలాంగులకు 5 మార్కులు, మౌఖిక ఇంటర్వ్యూకు 20 మార్కులు వెరసి వంద మార్కులకు పరిగణించడం జరుగుతుందని కనకదుర్గ తెలిపారు.

ఆడలి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారికి ప్రభుత్వం ఆర్థిక సాయమందించాలి

విశాలాంధ్ర-సీతంపేట : మండలం ఆడలి వ్యూ పాయింట్ వద్ద జరిగిన యాక్సిడెంట్లో ప్రమాదం జరిగిన వ్యక్తులకుసహాయం చేస్తుండగా సవర రెల్లయ్య అనే వ్యక్తికి మరొక ఆటో వచ్చి ఢీకొట్టడం జరిగింది. ఆయనను అత్యవసరంగా కేజీహెచ్ హాస్పిటల్ విశాఖపట్నంలో జాయిన్ చేసిన తర్వాత 18 వ తారీకు ఉదయం 4 గంటల ప్రాంతంలో మరణించడం జరిగింది. దీనికి కారణం అయిన వ్యూ పాయింట్‌కి వెళ్లే రహదారులు పర్యాటక ప్రాంతానికి తగినట్లుగా వెడల్పుగా లేకపోవడం, అదేవిధంగా సేఫ్టీ వాల్స్ నిర్మించకపోవడం మరియు హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడం వలన ఈ ప్రమాదం జరిగిందని కావున తక్షణమే ప్రమాదంలో మరణించిన వ్యక్తికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు ఆదివాసీమ నాయకులు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎన్. తిరుపతిరావు, వైస్ సర్పంచ్ రమేష్, స్థానిక ఎంపీటీసీ జేమ్స్, మరియు స్థానిక నాయకులు అదేవిధంగా ఆదివాసి జేఏసీ అధ్యక్షులు బి శ్రీనివాస్‌రావు, బి.ఉమామహేశ్వరరావు, మరణించిన వ్యక్తికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని చేపడతామని ఈ సందర్భంగా తెలియజేశారు.

హోంమంత్రి అమిత్‌షా ఏపీ పర్యటనను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర-బెలగాం : రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్‌ని అవమానపరిచిన హెూం మంత్రి అమిత్ షా ఎపి పర్యటనను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం పార్వతీపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి బెలగాం రైతు బజార్ కూడలి సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈసందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ దేశ అత్యున్నత పార్లమెంట్ లోనే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కి అవమానం జరిగిందని అంతటి అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన హెూం మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని, ఆంధ్రప్రదేశ్ పర్యటన రద్దు చేసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. బిజెపికి రాజ్యాంగం పట్ల రాజ్యాంగ నిర్మాత పట్ల ఎలాంటి గౌరవం లేదని రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం తమ విధానాలను అవలంబిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధంగా రైతులు, ప్రజలు, ప్రజా సంఘాలు, వామపక్ష శ్రేణులపై కేంద్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని విమర్శించారు. బిజెపి అవలంబిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు టి.జీవన్, సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, పి.రాజశేఖర్, బి.సూరిబాబు, పాకల సన్యాసిరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు పి.రమణి, బి. నరసింగరావు, భాస్కరరావు, పి. సంగం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి. రంజిత్ కుమార్, విద్యార్థి సంఘ నాయకులు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి : ఐటీడీఏ పీవో

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఎ ద్వారా చేపడుతున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ భవనాలను త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం సీతంపేట మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో చేపడుతున్న మల్టీపర్పస్ సెంటర్ల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకూడదని అన్నారు. అదేవిధంగా పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా లాడ, జలుబుగూడ, పాండ్ర, బాపడుగూడ, గొయ్యి పాండ్ర గ్రామాల్లో చేపడుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మండ గ్రామంలో సీసీడీపీ పథకం ద్వారా తాగునీరు కోసం చేపడుతున్న ఓవర్ హెడ్ ట్యాంకు పనులను పరిశీలించారు. అనంతరం కుసిమి పీహెచ్ సీని పరిశీలించారు. పీహెచ్ సీలో మెడికల్ కు సంబంధించిన బయో వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని అన్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు సింధూజ, నాగభూషన్, పీహెచ్ సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకొని రోడ్డు ప్రమాదాలను నివారించండి

విశాలాంధ్ర-బలిజిపేట: ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకొని రోడ్డు ప్రమాదాలను నివారించాలని బలిజిపేట మండలం ఎస్సై సింహాచలం తెలిపారు. ఆదివారం రహదారి భద్రతా మాసోత్సవములు సందర్భంగా బలిజిపేటలో ఆటో డ్రైవర్లకు సూచనలు తెలిపారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ వాహన డ్రైవర్లు తమ ఆరోగ్యము పట్ల జాగ్రత్త వహించాలని డ్రైవర్లు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను, రోడ్డు ప్రమాదములు గూర్చి, అధిక ప్రయాణికులతో ప్రయాణం చేయటం, హెల్మెట్ ధారణ గూర్చి, ఓవర్ స్పీడు రహదారి భద్రతపై అవగాహన కల్పించడం జరిగినది. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనములు నడపరాదని ఇద్దరు కంటే ఎక్కువ మందితో ద్విచక్ర వాహనము నడపరాదని ఆయన తెలిపారు. కుటుంబం భద్రత గుర్తు పెట్టుకోవాలని రహదారి భద్రతా నియమాలు పాటించాలని ప్రతి క్షణం జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని ప్రాణములు విలువ తెలుసుకోవాలని ఆయన కోరారు. ప్రమాదాలు నివారించడానికి డ్రైవర్లు అందరూ కృషి చేయాలని తెలిపారు. తదుపరి పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు వేగము కన్నా ప్రాణము మిన్న, హెల్మెట్ పెట్టుకో ప్రాణాలను కాపాడుకో అనే నినాదమును వాహన డ్రైవర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు.

ఆడలి ఘాట్ రోడ్‌లో డేంజర్ జోన్ బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర-సీతంపేట : మండలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినటువంటి టూరిజం ఆడలి వ్యూ పాయింట్ రహదారిలో ఈ మధ్యకాలంలో అనేక రహదారి ప్రమాదాలు జరిగి అనేకమంది మరణించిన మరియు అంగవైకల్యానికి గురైన సంఘటన నేపథ్యంలో సీతంపేట సబ్ ఇన్స్పెక్టర్ అమ్మనరావు ఆదివారం ఆడలి రహదారి మలుపుల వద్ద తమ పోలీసు బృందంతో డేంజర్ జోన్ అవగాహన బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సందర్శకులు తప్పనిసరిగా రహదారి భద్రతా జాగ్రత్తలు పాటించి పర్యాటకులు తమ వాహనాలతో వచ్చే సమయంలో వేగాన్ని తగ్గించుకొని గమ్యానికి చేరుకోవాలని తెలిపారు.

ఐటీడీఏ కార్యాలయంలో పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు వల్ల సురేష్ కోరారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయంలో గిరిజన ఉప సంచాలకులు (డిడి) విభాగంలో ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ పోస్టు ఆ విభాగంలో పనిచేసిన సీనియర్ అధికారిని నింపాలని, గురుకులం సూపరింటెండెంట్ (ఓఎస్డీ) ఆ విభాగంలో గతంలో పనిచేసిన ఉద్యోగి పదవి విరమణ అయిన తరువాత సంవత్సరాల గడిచిన ఇంతవరకు ఎవరిని నియమించలేదని గురుకుల సంబంధించిన అధికారిని పూర్తిస్థాయిలో నింపాలని గిరిజన విద్యార్థి సంఘం తదితరులు తరఫున గిరిజన సంక్షేమ అధికారులకు కోరుతున్నామన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి : జూనియర్ వెటర్నరీ అధికారి అప్పన్నబాబు

విశాలాంధ్ర-గంగవరం : రైతులు తమ ఇంటి వద్దనే పశువులకు వైద్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందని నెల్లిపూడి గ్రామీణ పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి పరిశిక. అప్పన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 20.1.2025 నుండి 31.1.2025 వరకూ పది రోజుల పాటు గంగవరం మండలంలో ప్రతీ గ్రామపంచాయతీ లో గల గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని రైతులు ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ శిబిరాలలో సాధారణ వ్యాధులకు, గర్భకోశవ్యాధులకు చికిత్స తో పాటు లేగదూడలకు ఏటికపాముల నివారణకు, గొర్రెలు, మరియు మేకలలో వ్యాధినిరోధక టీకాలు వేయడం జరుగుతుందని అన్నారు.

20 నుండి పశు ఆరోగ్య శిబిరాలు

విశాలాంధ్ర-బెలగాం : జిల్లాలో పశు ఆరోగ్య శిబిరాలను ఈ నెల 20వ తేదీ నుండి 31వ తేది వరకు నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్ ను విడుదల చేసారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం రాష్ట్రంలోని పశు పోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, నిధులు కేటాయిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందిస్తోందని ఆయన చెప్పారు. ఈ క్రమంలో పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించ డానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించడానికి, రైతుకు ఆర్థిక అండను కలగచేయడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. పశుసంవర్ధక సేవలను పశుపోషకులకు మరింత చేరువ చేయడానికి అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వెటర్నరీ డిస్పెన్సరీ, వెటర్నరీ ఆసుపత్రి పరిధిలో అన్ని మండలాలలో ఎంపిక చేసిన గ్రామాల్లో పశు వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. శిబిరాలను ప్రతి రైతు ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్. మన్మథరావు మాట్లాడుతూ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలలో పశువైద్యులు పరీక్షించి ఉచితంగా వైద్యం అందిస్తారన్నారు. తేలికపాటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని చెప్పారు. ఎదకు రాని, చూలు కట్టని, ఇతర గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగు వైద్యం అందించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఎదలో ఉన్న పశువులను గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయడం, చూడి పరీక్షలు నిర్వహించి శాస్త్రీయ సూచనలు ఇవ్వడం జరుగుతోందని ఆయన అన్నారు. పశువులకు, దూడలకు, సన్న జీవాలకు నట్టల మందు ఉచితంగా త్రాగించడం జరుగుతుందని, క్రమం తప్పకుండా నట్టల నివారణ మందు జీవాలు, దూడలకు

తాగించడం వలన బరువు పెరిగి ఆరోగ్యంగా ఉంటాయని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. పాడి పశువులకు నట్టల నివారణ మందు తాగించడం వలన పాల ఉత్పత్తి పెరగడంతో పాటు పునరుత్పత్తి మెరుగుపడు తుందని ఆయన పేర్కొన్నారు. పశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా అన్ని గ్రామాలలో సామూహికంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందించడం జరుగుతుందని, గొర్రెలు, మేకలకు ఉచితంగా బొబ్బవ్యాధి నివారణ టీకాలు అందించడం జరుగు తుందని, తద్వారా సన్న జీవాలలో వ్యాధి నిరోధక శక్తితోపాటు పెరుగుదల, పునరుత్పత్తి సామర్థ్యం మెరుగు పడుతుందని అన్నారు. రాష్ట్రంలో గుర్తించిన జిల్లాలలో కోళ్ళకు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందిచడంతోపాటు, అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలలో పశుపోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతుల పైన, పశు విజ్ఞానంపైన అవగాహనా సదస్సులు నిష్ణాతులైన పశువైద్యులతో నిర్వహిస్తున్నమని వివ రించారు. శాస్త్రీయ పశు యాజమాన్యం, పరిశుభ్రత వలన పరిశు భ్రమైన పశు ఉత్పత్తుల ఉత్పత్తి, పశుగ్రాసాల వృధాని అరికట్టడం, వ్యాధుల వ్యాప్తి నియంత్రణ, ప్రతికూల వాతావరణ పరిస్థితులలో సైతం లాభాసాటి పశు యాజమాన్యం జరుగుతుందని ఆయన చెప్పారు.

పశుపోషకుల సంక్షేమంకు వివిధ పథకాలు : పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించడంతో పాటు పశుసంవర్ధక రంగాన్ని మరింత మెరుగుపరచే క్రమంలో ప్రభుత్వం వివిధ నూతన పథకాలను ప్రవేశపెట్టి తోడ్పాటును అందించడానికి గోకులం, బహువార్షిక పశుగ్రాస క్షేత్రాలు, పశుబీమా, పెట్టుబడి రాయితీపై సరఫరా, పశుకిసాన్ క్రెడిట్ కార్డులు, సంచార పశుఆరోగ్య సేవా వాహనాలు, లింగ నిర్ధారిత వీర్యం, పిండ మార్పిడి పరిజ్ఞానం వంటి పథకాలను అమలు చేయటం జరుగుతోందని మన్మథరావు వివరించారు. పశువులకు ఆశ్రయం కల్పించలేని షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, దారిద్ర్యరేఖకు దిగువనున్న పేద పశుపోషకుల పశు వులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక నిధులతో 90 శాతం రాయితీపై 2,4,6 పశువుల షెడ్ల నిర్మాణంను, 70 శాతం రాయితీపై గొర్రెలు, మేకలు, కోళ్ళ షెడ్ల నిర్మాణం చేపట్టం జరుగుతోందని ఆయన చెప్పారు.

23,940 గోకులాల యూనిట్లు మంజూరు : ఈ ఆర్థిక సంవత్సరంలో 23,940 గోకులాల యూనిట్లు మంజూరు చేయగా, 22,337 గోకులాల యూనిట్ల పనులు ప్రారంభించడం జరిగిందని మన్మథరావు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పశుగ్రాస భద్రతా విధానం 2021- 26లో భాగంగా పశు గ్రాసాల అభివృద్ధి, పరిరక్షణ ద్వారా పశుగ్రాస అవసరాలను తీర్చడానికి, పశుగ్రాసంలో స్వయం సమృద్ధి సాధించడానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక అనుసంధానంతో నూరు శాతం రాయితీపై బహువార్షిక పశు గ్రాసాల క్షేత్రాలను ప్రోత్సహించడం జరుగుతోందని ఆయన అన్నారు. వ్యక్తిగతంగా రైతులు 10 నుండి 50 సెంట్ల వరకు సాగు చేసుకోవచ్చని, 5 ఎకరాల లోపు భూమి గల చిన్న, సన్నకారు రైతులు అర్హులని తెలిపారు. పశు ఆరోగ్య శిబిరాలలో అనేక కార్యక్రమాలను రైతులకు వివరించడం జరుగుతుందని, పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి వస్తున్న అమిత్‌షా తిరిగి వెళ్లాలి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి మన రాష్ట్రానికి వస్తున్న అమిత్ షాను వెంటనే ఇంటికి వెళ్లాలని, సిపిఎం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు.. రేకపల్లి జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి అమిత్ షాను గో బ్యాక్ గో బ్యాక్ అంటూ వినాదాలు చేశారు . ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నం. రాజులు, జిల్లా నాయకులు సోయం. చిన్నబాబు, మండల కార్యదర్శి పులి. సంతోష్ కుమార్, మాట్లాడు తూ పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అహంకారపూరితంగా అవమానకరంగా మాట్లాడిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమ యంలో రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు... కోట్ల ప్రజల మనోభావాలను కించపర్చేలా అమిత్‌షా వ్యాఖ్యలు చేశారన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ హక్కులతో గద్దెనెక్కిన మోడీ, అమిత్‌షా వ్యాఖ్యల విషయంలో మౌనం ప్రదర్శించడం సిగ్గు చేటన్నారు. అంబేద్కర్ ఒక కులానికో మతానికో సంబంధించిన వ్యక్తి కాదని, దేశ ప్రజలందరూ సమానత్వంతో సమాన హక్కులు కలిగి ఉండాలని రాజ్యాంగాన్ని రచించిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం అన్నారు. మన రాష్ట్రానికి వస్తున్న అమిత్ షాను తక్షణమే తిరిగి వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వడ్లాది రమేష్, హజరత్, కే కాంతారావు, కే సత్యనారాయణ, తాతబాబు, పాండురాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జెకేసిటి వాలీబాల్ టోర్నీ-2025 విజేతగా 'వేగితోట'

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతరామరాజు జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలో క్రీడలను ప్రోత్సాహించాలి క్రీడలలలో గ్రామీణ యువకులు రానించాలి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ముఖ్యద్దేశంతో ఏజెన్సీలో యువతను ప్రోత్సహిస్తూ జమాల్ ఖాన్ చారిటీబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సహాయ సహకారలు అందిస్తూన్న చైర్మన్ జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలలో భాగంగా చింతూరు సంతపాకాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్లో డివిజన్ నుండి 28 జట్లు పాల్గొనగా ప్రథమ స్థానంలో వేగితోట, ద్వితీయ స్థానం చొప్పల్లి టీమ్‌లు విజేతలగా నిలిచాయి. ఎంతో హెూరా హెూరిగా సాగిన ఫైనల్ మ్యాచ్ లో మొదటి సెట్ ను వేగితోట 25 చొపల్లి 23 రెండో సెట్ అంతే హెూరా హెూరిగా చివరివరకు పోరాడుతు ఆడిన వేగితోట-చొప్పల్లి మధ్య ఉత్కంట భరింతంగా సాగిన రెండో సెట్ ను 30-28 తేడాతో వేగితోట కైవసం చేసుకుని ట్రోఫీ విజేతగా నిలిచింది. ఫైనల్‌కు చేరుకుని విజేతలగా, రన్నర్ టీమ్‌లకు ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ అభినందనలు తెలిపారు.

పాడేరు జిల్లా కేంద్రంలో మూసుకుపోయిన రెవిన్యూ అధికారుల కళ్ళు

- పట్టణ మెయిన్‌రోడ్డు మీదే అనుమతులు అతిక్రమించి గిరిజనేతరుడు అంతస్తు మీద అంతస్తు నిర్మాణం
- 1/70 చట్టానికి వ్యతిరేకంగా మేజర్ పంచాయతీలో నిర్మాణాల జోరు

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా కేంద్రంలో పూర్తిగా రెవిన్యూ అధికారుల కళ్ళు మూసుకుపోయింది. పాడేరు పట్టణ మెయిన్ రోడ్డుమీదే అనుమతులు అతిక్రమించి ఓ గిరిజనేతరుడు దర్జాగా అంతస్తు మీద అంతస్తు నిర్మాణం చేస్తునప్పటికీ చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా మేజర్ పంచాయతీలో నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయంటే నమ్మశక్యంగా లేదా.?(ఎస్) అవుననే సమాధానం చెప్పాలి. ఎందుకంటే శతకం పట్టు సెంటర్లో ఈ నిర్మాణం ప్రస్తుతం జరుగుతుంది. ఈ నిర్మాణానికి మెజర్ పంచాయతీ కార్యాలయానికి సుమారు 600 నుండి 800 అడుగులు దూరం ఉంటుంది. కాని చూసీచూడనట్లు వదిలేయడంతో ఇష్టాను సారం నిర్మాణాలు చేస్తున్నారు. వాస్తవానికి పంచాయతీ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు చేయకూడదు. అటువంటిది దర్జాగా అంతస్తు మీద అంతస్తు నిర్మాణం చేస్తున్నారంటే పంచాయతీ అధికార్లు ఎంతటికి అమ్ముడుపోయాయి ఇట్టే అర్థమవుతుంది. పాతబస్టాండ్‌లో ఓ గిరిజనేతరుడుకి కిరాణా దుకాణం ఉంది. అదే గిరిజనేతరుడు దర్జాగా అంతస్తు మీద అంతస్తు నిర్మాణం చేస్తూ వ్యాపార సముదాయాలు నిర్మాణాలు చేస్తున్నారు. అదే రోడ్కి ఇరువైపులా ఖాళీగా ఉన్న స్థలంలో గిరిజనుడు చిన్నపాటి దుకాణం వేస్తేనా ఆఘమేఘాలుగా రెవిన్యూ అధికారులు పరుగులుతీసి వెంటనే సవాలక్ష రూల్స్ చెప్పి ఖాళీ చేయిస్తారు. గిరిజనేతరులు సొమ్ము చెల్లిస్తారు. గిరిజనుడు సొమ్ము ఇవ్వడు అదే ఇక్కడ తేడా ఉంది. 1/70 చట్టాన్ని అమలు చేయాల్సి ఉన్న రెవిన్యూ అధికార్లు కుమ్మక్కై కంచె చేను మేస్తుంటే కాపలదారుడు ఎవరు? ఒక వైపు బినామీ పేర్లతో గిరిజనేతరులకు కొమ్ముకస్తున్న గిరిజనులు ఉంటే మరో వైపు అధికారులే బినామీ వ్యవస్థ నడిపే పరిస్థితి పాడేరు పట్టణంలో ప్రస్తుతం నెలకొంది. బినామీ వ్యవస్థ రూపుమాపాలి అంటే ముందు రెవిన్యూ అధికారులు చిత్తశుద్ధితో ఉద్యోగ ధర్మాన్ని పాటించాలి. అప్పుడే బినామీ వ్యవస్థ రూపుమాప వచ్చు. బినామీ పేర్లతో ఎవరెవరు ఉన్నారు అనే దానిపై సమగ్రమైన విచారణ జరిపి నిగ్గుతేల్చి వారికి ప్రభుత్వ పరంగా అందే రాయితీ ఇవ్వకుండా నిలిపేయాలి అప్పుడే బినామీ వ్యవస్థ రూపుమాపవచ్చు. పాడేరు పట్టణపరిసర ప్రాంతాల్లో ఆదివారం వస్తే చాలు ఎగబడి

నిర్మాణాలు చేస్తున్నరూ. ఉన్నత స్థాయి అధికార్లు కూడా నామమాత్రపు ఆదేశాలు జారీ చేయడం వల్ల దాన్నే ఆసరాగా తీసుకొని రెవిన్యూ అధికారులు రెచ్చిపోయి ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తూ అందినకాడికి దోచుకోవాలని ప్రయత్నం చేస్తున్నారనే పబ్లిక్‌గా ఆరోపణలు చేసిన సందర్భాలు లేకపోలేదు. ఇది నిజమని అనుకోవడానికి చూడండి మెయిన్ రోడ్డుకి ఆనుకొని అంతస్తుమీద అంతస్తు నిర్మాణం చేస్తున్నారంటే ఇదే మరి... గతంలో ఇదే నిర్మాణం దుకాణ నిర్మాణం చేస్తున్న సమయంలో ఫిర్యాదు చేస్తూ నామ మాత్రంగా ఆపేసినట్లు ఆపేసి మళ్ళీ ఆదివారం మొదలెట్టారు. ఇప్పటికైనా పత్రికల్లో వచ్చిన వార్త కథనానికి స్పందించి నిలుపుదల చేస్తారో లేదో వేచిఉండాల్సి... రెవిన్యూ అధికారుల చిత్తశుద్ధి గిరిజనుల పక్షాన లేక గిరిజనేతరుల పక్షాన నిలబడుతారో వేచిచూడాల్సిందే మరి.

సందర్శకులను ఆకట్టుకునేలా అరకు ఉత్సవ్ చలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : సందర్శకులను, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా చలి పేరుతో అరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఏ ఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం సంబంధిత లైన్ డిపార్ట్మెంట్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించా లన్నారు. స్థానికంగా తాజంగి, లంబసింగి, వనజంగి, కొత్తపల్లి జలపాతాలు, చాపరాయి లాంటి ప్రదేశాలతో కూడిన వీడియోలను అరకు ఉత్సవ్ ప్రమోషన్ క్యాంపైన్లో చూపించాలన్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కళారూపాలను రోజువారి కార్యక్రమాలను రూపొందించాలన్నారు. వారికి అవసరమైన వసతి, భోజన, రవాణా ఏర్పాట్లను చూడాలన్నారు. అందుకు తగిన విధంగా కమిటీలను ఏర్పాటుచేసే బాధ్యతలను అప్పగించాలని సూచించారు. నోడల్ అధికారులకు వారి విధులు, బాధ్యతలు స్పష్టం చేయాలని ఆదేశించారు. విశాఖపట్నం నుండి అరకు వచ్చే వెళ్లే వారికి ట్రావెల్ ఆపరేటర్లతో మాట్లాడి సీట్లను బట్టి ఒక ధరను నిశ్చయించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆనరోరియం, వేదిక, బారికేడ్లు, రవాణా, వసతి, భోజన సౌకర్యాలు కల్పనకు, బడ్జెట్ అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. ఆహ్వాన పత్రికలు ప్రోటోకాల్ ప్రకారం సిద్ధం చేయాలన్నారు. అరకు ఉత్సవంలో స్ట్రీట్ లైట్లు, వెల్కమ్ ఆర్చులు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు తదితర అంశాలకు జీవీఎంసీ సహకారం తీసుకోవాలన్నారు.

వేమన గొప్ప మానవతావాది

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : యోగి వేమన గొప్ప మానవతావాది అని జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత అన్నారు. యోగి వేమన జయంతి కార్యక్రమం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘ సంస్కరణను ప్రబోధించి సర్వమానవ సమానత్వం, అశ్పృస్యత ఖండన, నైతికప్రబోధం, మూఢనమ్మకాల ఖండన వంటి అంశాలను తన పద్యాలలో వెల్లడించారని తద్వారా గొప్ప మానవతావాదిగా పరిగణించడం జరిగిందన్నారు. కవిగా, యోగిగా ప్రజాదరణ పొందారని ఆమె చెప్పారు. సరళమైన భాష, మధురమైన సందేశం కారణంగా ప్రజలు వేమన పద్యాలను ఆదరించారని పేర్కొన్నారు. సిపి బ్రౌన్ వంటి వారు వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదించారని, తద్వారా వాటి ప్రాశస్త్యాన్ని గుర్తించవచ్చని అన్నారు. వేమన కవిత్వ శైలి వేమన పద్యాల్లోని అనేక పంక్తులు ఇప్పుడు తెలుగు భాష వ్యావహారిక పదబంధాలుగా విరాజిల్లుతున్నాయని ఆమె అన్నారు. వేమన కవితలు సామాజిక, నైతిక, వ్యంగ్య, ఆధ్యాత్మిక స్వభావం కలిగి ఉంటాయని అన్నారు. ఒక్క వేమన పద్యం కూడా వినని తెలుగువారు ఉండరని ఆమె అన్నారు. సమాజంలోని

రుగ్మతలను తూర్పార బట్టిన మనో వైజ్ఞానికుడు వేమన అని ఆమె పేర్కొన్నారు. సమకాలీన వ్యవస్థలపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన సంఘ సంస్కర్త, విప్లవకారుడు అన్నారు. పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరరావు కేంద్ర సాహిత్య అకాడమీ వారి సహకారంతో వేమన జీవిత చరిత్రను 14 భాషలలోకి అనువదించడానికి కారకులయ్యారని ఆంగ్ల, ఐరోపా భాషల్లోకి, అన్ని ద్రవిడ భాషల్లోకి వేమన పద్యాలు అనువాదమయ్యాయని అన్నారు. సి.ఇ గోవర్ వంటి ఆంగ్ల సాహితీవేత్తలు వేమన సాహిత్యానికి ముగ్ధులై ఆయనను లోక కవిగా కీర్తించారని ఆమె చెప్పారు. వేమన గౌరవార్థం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కడపలో విశ్వవిద్యాలయానికి 2006లో యోగి వేమన విశ్వవిద్యాలయం అని పేరు పెట్టడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌ఆర్ సిఎస్ డిసి డాక్టర్ పి. ధర్మచంద్రరెడ్డి, జిల్లా కలెక్టర్ కార్యాలయ విభాగం పర్యవేక్షకులు శ్రీరామ్మూర్తి, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఎస్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా ఆదర్శ మహిళా అవార్డు గ్రహీత కే.కృష్ణకుమారి

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : మానవ హక్కుల నేర నిరోధక సంఘం ఆంధ్రప్రదేశ్ మహిళా అధ్యక్షురా లుగా పనిచేస్తున్న కే.కృష్ణకుమారి చేస్తున్న సేవలను శారద ఎడ్యుకేషనల్ సొసైటీ గుర్తించి సౌత్ ఇండియా ఆదర్శ మహిళగా అవార్డు గ్రహీతగా హైదరాబాద్ బిర్లా మందిర్ ఆడిటోరియంలో సినీ నటి కవిత హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ చేతులమీదగా సౌత్ ఇండియా ఆదర్శ మహిళగా అవార్డును సోమవారం కృష్ణకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ అయినప్పటికీ అంకితభావంతో సమాజ సేవకు చేస్తున్న కృష్ణకుమారికి వారు అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని వారు ఆకాంక్షించారు.

ఆరోగ్య సహాయకులను నిర్దాక్షిణ్యంగా విధుల నుండి తొలగించడం అన్యాయం

విధుల నుండి తొలగించబడిన ఆరోగ్య సహాయకుల కుటుంబీకుల ఆవేదన

విశాలాంధ్ర-చింతపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండు వేల మంది ఆరోగ్య సహాయకు (హెల్త్ అసిస్టెంట్స్)లను నిర్దాక్షిణ్యంగా విధుల నుండి తొలగించడం అన్యాయమని ఆరోగ్య సహాయకుల కుటుంబీకులు అంటున్నారు. నాటి ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగ నియామకాలు రెండు దశాబ్దాలకు పైగా (23ఏళ్ల పాటు) ఆరోగ్య సహాయకుల చేత వెట్టి చాకిరి చేయించుకుని నేడు వారిని అర్ధంతరంగా విధుల నుండి తొలగించడంతో ఆరోగ్య సహాయకుల (హెల్త్ అసిస్టెంట్స్) కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రభుత్వాలే ఉద్యోగ నియామకాలు చేసి నేడు అవే ప్రభుత్వాలు ఆరోగ్య సహాయకులను నిర్దాక్షిణ్యంగా విధులనుండి తొలగించడంతో ఆ కుటుంబాలు అటు ఆర్థికంగానూ, ఇటు మానసికంగానూ ఇబ్బంది పడుతున్నాయి. ఇప్పటికే 50 ఏళ్లకు పైబడిన ఆరోగ్య సహాయకులు ఉద్యోగం లేక, మరో ఉద్యోగానికి వెళ్లేందుకు వయసు మించిపోయి, మరో వృత్తి చేసుకోలేని స్థితిలో మనోవేదనకు గురవుతున్నారు. కేవలం ఉద్యోగాన్ని నమ్ముకుని కుటుంబ పోషణతో పాటు పిల్లల చదువులు, వివాహాలు, ఇతర కార్యక్రమాలపై ప్రణాళికలు రచించుకున్న ఆరోగ్య సహాయకుల కుటుంబాలు నేడు ప్రభుత్వం తీసుకున్న దుందుడుకు నిర్ణయం కారణంగా ఉద్యోగాలు లేక వేసుకున్న ప్రణాళికలన్నీ ఆర్థిక సమస్యతో కూడుకున్నవి కావడంతో చేసేదిలేక లబోదిబోమంటున్నారు. తమ సమస్య పరిష్కారానికి సంబంధిత ఉన్నతాధికారుల, పాలకుల చుట్టూ తిరిగిన ఫలితం కనిపించడం లేదని ఆరోగ్య సహాయకులు గగ్గోలు పెడుతున్నారు. చేసేదిలేక, ఆర్థిక ఇబ్బందులను చెప్పుకోలేక కొంతమంది ఆరోగ్య సహాయకులు మనోవేదనతో ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు లేకపోలేదు. ఇటువంటి సందర్భాలలో ఆరోగ్య సహాయకుల పరిస్థితిపై ఏ ఒక్కరి వద్ద ప్రస్తావించిన ఇన్నేళ్లు విధులు నిర్వర్తించిన ఉద్యోగులను ఏ విధంగా తొలగిస్తారు అని అంటున్నప్పటికీ ప్రభుత్వము, సంబంధిత ఉన్నత ఉద్యోగులు మాత్రం తొలగించబడిన ఆరోగ్య సహాయకులపై కనీసం కనికరం లేకుండా నిర్దాక్షిణ్యంగా విధుల నుండి తొలగించి తమ కుటుంబాలను బజారున పడవేశారని ఆరోగ్య సహాయకుల కుటుంబీకులు ఆవేదనతో పాటు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆడలి రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకొంటాం : ఐటిడిఎ పీవో

విశాలాంధ్ర-సీతంపేట : ఆదివారం ఆడలి వ్యూ పాయింట్ ను పరిశీలించి మార్గం మధ్యలో ఉన్న మలుపులను పరిశీలించారు. మలుపుల వద్ద రక్షణ గోడలు, రోడ్డు విస్తరణ కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని సూచించారు. దీనితో పాటు జలుబుగూడ గ్రామానికి కూడా రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ నగభూషన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్స్ పంపిణీ

విశాలాంధ్ర-రంపచోడవరం : శ్రీస్వామి వివేకానంద 163 జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నారాయణ సేవలో భాగంగా శ్రీ రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల, సిరిగిందలపాడులో రంపచోడవరం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్స్ పంపిణీ చేశారు. ఆదివారం రంపచోడవరం గ్రామ పంచాయతీ లో పనిచేసే 17మంది పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్స్ వితరణ జరిగినది.ఒక్కొక్క రేషన్ కిట్స్‌లో 9రకాల వంట సరుకులు కందిపప్పు కిలో మినపప్పు కిలో పంచదార కిలో గోధుమపిండి కిలో వేరుశెనగగుళ్ళు కిలో ఇడ్లీ రవ్వ కరాచీ రవ్వ కిలో వంటనూనె కిలో టీ పౌడర్ 100గ్రాములు ఉన్నవి వీరికి అన్నదానం కూడ చేశారు ఈ పంపిణీ కార్యక్రమం లో డా.తలారి వేంకట సుబ్బారావు, డా.రాయుడు శ్రీనివాస్, డా.సంపత్ కుమార్, డా.దాసరి ఉమామహేష్, గ్రామ పంచాయతీ శానిటేషన్ సెక్రటరీ బి.ఎస్.వి.వి సత్యనారాయణ రెడ్డి, రామకృష్ణ మిషన్ మెడికల్ క్యాంప్ కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్స్ సూర్య, దాసరి పెద్ద అప్పారావు పాల్గొనట్లు రామ కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీ పరిజ్ఞేయనంద జీ మహారాజ్ తెలిపారు.

సీలేరులో పులి అంటూ ప్రచారం..?

విశాలాంధ్ర-సీలేరు : సీలేరు గ్రామంలో పులి సంచరిస్తుందని ప్రచారం జోరందుకుంది. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో విశాఖపట్నం నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కొందరి ప్రయాణికులు బస్సు ఏపీ జెన్ కో చెక్ పోస్ట్ దాటి ఊర్లోకి వస్తుండగా ఫారెస్ట్ డిపోలో పులి నడుచుకుంటూ వెళుతూ కంటపడిందని కొందరు వ్యక్తులు చెప్పారు. ఈ విషయం ఆనోట ఈ నోటా ఊరంతా పాకిరింది. దీంతో ఊర్లోకి పులి వచ్చిందని ప్రచారం జరగడంతో స్థానికులు భయాందోళన చెందారు. దీనిపై కొందరు బస్సు డ్రైవర్‌ను అడగగా మేము చూడలేదని ప్రయాణి కులు చూశారని చెప్పారని వివ రించారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖా అధికారులు పులి తిరిగిన డిపో పరిధిలోకి వెళ్లినప్పటికీ ఎటువంటి ఆనవాళ్ళు దొరకలేదని ఈ విషయంపై కచ్చితమైన సమాచారం ఇవ్వలేమని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్.వెంకట రావు తెలిపారు. ఈమధ్యకాలంలో సీలేరు రేంజి పరిధిలో సప్పర్ల అటవీ ప్రాంతంలో రోడ్డు దాటు తుండగా పెద్ద పులి కనిపించింది. ఆ పులి ఆచూకీ కోసం ఇప్పటికే అటవీ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేపడుతున్న తరుణంలో సీలేరు అటవీ శాఖా డిపో పరిధిలో పులి కనిపించింది అనడం మరింత భయాన్ని గురిచేస్తుంది.

నేటి నుంచి ఇంటర్న్‌షిప్ మేలా

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ కార్యక్రమం ద్వారా జిల్లాలోని యువతకు ప్రముఖ కంపెనీలు, పరిశ్రమలలో ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించడానికి ఈనెల 20, 21వ తేదీన జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయం ఐటీడీఏ పాడేరు, వైటిసి రంపచోడవరం, ఐటీడీఏ చింతూరులలో ఇంటర్న్‌షిప్ మేళాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా పదవ తరగతి, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ వంటి డిగ్రీ పూర్తి చేసి 21 నుండి 24 సంవత్సరాల వయసు కలిగిన నిరుద్యోగ యువతకు స్టైఫెండ్ కింద నెలకు అయిదారు వేల రూపాయలు చెల్లిస్తూ ఏడాది పాటు ఇంటర్న్ షిప్ కల్పిస్తామని వివరించారు. ఆ సమయంలో భీమా సౌకర్యం, పీఎం జీవన్ జ్యోతి, బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన లాంటి సౌకర్యాలు అందిస్తామన్నారు. ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం కింద లబ్ది పొందదలచిన అభ్యర్థులు పైన తెలిపిన కార్యాలయాల్లో ధృవ పత్రాలతో హాజరు కావాలని కోరారు. రాష్ట్రంలో రూ. 800 కోట్ల ఖర్చుతో ప్రముఖ టాప్-500 కంపెనీల్లో కోటి మందికి నైపుణ్యాలు కల్పించేందుకు ఈ స్కీమ్ ఉద్దేశించబడిందని తెలిపారు. అయితే అభ్యర్థులు పూర్తి వివరాలకు పాడేరు-9949927899, రంపచోడవరం 9398338105 చింతూరు : 63054 52812 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

నేను బతికుండగా రా నాయనా.... చూడాలని వుంది..!

పోలీసులు ఇటీవల ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆవేదన వ్యక్తపరిచిన దామోదర్ తల్లి బతుకవ్వ

విశాలాంధ్ర-చింతూరు : బీజాపురం ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టు నేత దామోదర్‌ను ఒక్కసారి చూడాలని ఆమె తల్లి బతుకవ్వ ఎంతగానో ఎదురు చూశారు. ఈమేరకు ఇటీవల పోలీసులు ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ ఆమె మాట్లాడారు. 15 రోజుల కిందట ములుగు ఎస్పి బరీష్ కాల్వపెల్లి సందర్శించారు. దామోదర్ తల్లి వద్దకు వెళ్లి అడవిలో ఉండిసాధించేది ఏమిలేదు లొంగిపోతే ప్రభుత్వపథకాలను అందిస్తామని నీద్వార సందేశం పంపించమని ఆమెను కోరారు. తల్లికూడ అదే మాట చెప్పింది. చావుకు దెగ్గరగా ఉన్నాను, కడసారి చూపైన చూడటానికి అడవిని వదిలి రానాయనా దామోదరా అని చెప్పింది. అడవిలొ ఉంటే ప్రాణాలు పోతాయని ఇంటికి రమ్మని ఆదుకుంటామని కోరారు. కన్నతల్లికి కడసారి శవమై కనిపించే ప్రాణాలతో చిన్నకొడుకైన దామోదర్‌ను కడసారి కనులారా చూద్దామని తల్లి బతుకవ్వ పిలిచింది. కాని శవమై కనిపిస్తాడని కలలో కూడ ఊహించలేదు. బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన విషయం తెలవగానే తల్లిప్రాణం తల్లడిల్లింది. కడసారి చూడడానికి కూడా నోచుకోలేక పోయానని వృద్ధురాలు విలవిల్లాడింది. మిలట్రీ చీఫ్, రాష్ట్రసెక్రెటరీగా వ్యవహరించిన మావోయిస్టు నేత దామోదర్ ప్రభుత్వానికే తలనొప్పిగా మారి పోలీసులకు చుక్కలు చూపించారు. పార్టీకే రూపకర్తగా ఎదిగిన బడేచొక్కారావు దామోదర్ పేరుతో రూ.2.50 కోట్ల రివార్డును ప్రభుత్వం ప్రకటించింది.

బీజాపురం ఎన్‌కౌంటర్‌లో 19 మంది మావోలు మృతి చెందారని ఇందులో దామోదర్ ఉన్నట్లు మావోస్టుపార్టీ పేరున లేఖ విడుదలైంది.

కామ్రేడ్ దామోదర్‌కి కాల్వ పెల్లి వీడ్కోలు : భూమికోసం భుక్తికోసం జల్ జంగల్ జమీన్ కోసం అడవిబాట పట్టిన కామ్రేడ్ దామోదర్ చత్తీస్గడ్ బీజాపూర్ ఎన్ కౌంటర్‌లో హతమయ్యాడు. ఈ ఎదురుకాల్పుల్లో 19 మంది మావోయిస్టులు మృతిచేందారు. ఇందులో కొందరు అగ్రనేతలు ఉన్నట్లు అనుమానాలు వచ్చాయి. ఇందులో దామోదర్ బడేచొక్కారావు ఉన్నట్లు మావోయిస్టు పార్టీ లేఖను విడుదల చేసింది. దీంతో అనుమానాలు నిజమయ్యాయి. అలుపెరగని వీరుడికి అన్నలు లాల్ సలామ్ అంటూ జై కొట్టారు. తెలంగాణ ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వ పెల్లి స్వగ్రామంలో విషాదం నెలకొంది. ఈవిషయం రాష్ట్రంలోనే సంచలనమైంది. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం కాల్వపెల్లికి చెందిన బడేచొక్కారావు అలియాస్ దామోదర్ బీజాపురం ఎన్ కౌంటర్‌లో మృతిచెందిన విషయం తెలంగాణ ములుగు జిల్లాలో దావానంలా వ్యాపించింది. శనివారం రాత్రే మండల వ్యాప్తంగా తెలియడంతో మండలంలో ప్రజలు నమ్మలేక పోతున్నారు. టీవీలలో చూసి తెలిసిన వాళ్లకు తెలపడంతో చుట్టుపక్కల గ్రామాలకు తెల్సిపోయింది. కాల్వపెల్లి సహా చుట్టుపక్కల గ్రామాల్లో విషాదం నెలకొంది.

ఘనంగా అల్లూరి పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-కొయ్యూరు : పుట్టిపెరిగిన గ్రామంలో గడిచిన పదేళ్లుగా ఒకే పాఠశాలలో బాల్యభ్యాసం చేసి నేటికీ కలిసికట్టుగా ఉన్న పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పలకరింపుల మధ్య గత స్మృతులను గుర్తుచేసుకుంటూ అత్యంత ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు పోతల శ్రీరామ్మూర్తి, కార్యదర్శి ఎస్.చైతన్యబాబు, ప్రతినిధులు చింతల ప్రకాశ్, దలే సత్యనారాయణ, పి వి రమణ ఎల్ వి రమణ తదితరుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అల్లూరి పార్కులో ఈ పూర్వపు విద్యారుల ఆత్మీయ సమ్మేళనం జరిపారు.అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో కార్యదర్శి చైతన్యబాబు మాట్లాడుతూ పదేళ్ళ క్రితం ప్రారంభించిన పూర్వపు విద్యార్థుల సంఘం పటిష్టకు తగిన పండ్ సమకూర్చవల్సిన అవసరం ఉందన్నారు. అధ్యక్షులు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ సంఘం పురోగతికి భవిష్యత్ కోసం, భవన నిర్మాణానికి తదితర వాటికి మరింత ఉత్సాహంతో సహకరించాల్సిన అవసరంఉందన్నారు. ఇందుకు ప్రతి సభ్యులు తమ వంతు కృషిగా ముందుకు రావాలన్నారు. ప్రతినిధులు పూర్వపు విద్యార్థి దలే సత్యనారాయణ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి ఇక్కడ చదివిన విద్యార్థులతో మరింత సంఖ్య బలాన్ని పెంచుటకు కృషిచేస్తూ ప్రతిపాదించిన తీర్మానాన్ని అమలు చేసేందుకు అందరి చొరవ తీసుకోవాలన్నారు. చింతల ప్రకాశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంఘం కోసం తోడ్పడాల్సినఅవసరం, సహకారం ఉండన్నారు. సభ్యులు గుర్తింపుగా ఏది ఒక సేవా కార్యక్రమం తలపెట్టలని నిర్ణయం చేశారు. సమావేశంలో సంఘ అభివృద్ధికి పలువురు పలు సూచనలు చేశారు. భవనం నిర్మాణంకు నిధి సమకూర్చే ప్రతిపాదనలో భాగంగా తొలి విడతగా పూర్వపు విద్యార్థి దలే సత్యనారాయణ పది వేల రూపాయిలను ముందుగా సంఘ ప్రతినిధులకు అందించటం పట్ల అందరి అభినందనలు తెలియజేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పలు ప్రాంతాల నుంచి పూర్వపు విద్యార్థులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.